సాక్షి సంగారెడ్డి

శనివారం । 6 । ఏప్రిల్ । 2024



సిరుల స్వీట్‌కార్న్

స్వీట్ కార్న్ పంటను జిల్లాలో విరివిగా సాగు చేస్తున్నారు. సాధారణ మొక్కజొన్న రకాన్ని పోలి ఉంటుంది. దీనికి మార్కెట్‌లోనూ డిమాండ్ ఎక్కువే.

వివరాలు IIలో ▸



న్యాయ విద్యలో రాణించేలా..

గిరిజన లా కళాశాలను మూడేళ్ల క్రితం సంగారెడ్డిలో ఏర్పాటు చేశారు. దేశంలోనే ఏర్పడిన మొదటి ఎస్టీ గురుకుల న్యాయ కళాశాల ఇది.

వివరాలు IIలో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
శనివారం (సాయంత్రం)	ఆదివారం (ఉదయం)
06:35	04:44

న్యూస్‌రీల్

పరిశ్రమలో క్లూస్‌టీం పరిశీలన



ఆధారాలు సేకరిస్తున్న అధికారులు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధి చందాపూర్ గ్రామ శివారులోని ఎస్బీ ఆర్గానిక్ పరిశ్రమను శుక్రవారం ఫోరెన్సిక్ టీం సందర్శించింది. రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్ రాజ్ నేతృత్వంలోని పేలుడు జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కెమికల్స్, రియాక్టర్ ముక్కల శాంపిల్స్ సేకరించారు. రిపోర్ట్ ఆధారంగా వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. జిన్నారం సీఐ అరుణ్ కుమార్, ఎస్సై సుభాష్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవం



కలశాల ఊరేగింపులో మహిళలు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని గంజివెనుకగల పంచముఖ హనుమాన్ ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ కాలనీ మహిళలు కలశాల ఊరేగింపుతోపాటు పంచముఖ హనుమాన్ ఆంజనేయ స్వామి పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటాపురం సత్యనారాయణ, సుజాత దంపతుల ఆధ్వర్యంలో అభిషేకం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జీవన్, జితేందర్, శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు, నర్సింలు, చంద్రసేన పాల్గొన్నారు.

ఓటరు అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది

జహీరాబాద్ టౌన్: పట్టణంలో శుక్రవారం పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. లోకసభ ఎన్నికల్లో 'నేను కచ్చితంగా ఓటు వేస్తా' అనే నినాదం తో ఓటు విలువను తెలియజేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ర్యాలీలో పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ రఘువీర్, పోస్టుమాస్టర్ సుభాష్, డిప్యూటీ పోస్టుమాస్టర్ పాండు సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు



ఫైనల్ పోటీ పడిన పహిల్వాన్‌లు

జహీరాబాద్ టౌన్: మండలంలోని మల్‌చెల్మ గ్రామంలో కొనసాగుతున్న హజ్రత్ పీర్ మన్నాన్ సాహెబ్ ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్రలకు చెందిన పహిల్వాన్లు పాల్గొన్నారు. ఫైనల్లో కర్నాటక మల్లయోధునిపై మహారాష్ట్ర పహిల్వాన్ పవన్ విజేతగా నిలిచాడు. ఉత్సవాల్లో భాగంగా కవాలి, గంధం ఊరేగింపు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం



ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ట్రాఫిక్ సమస్యలను తెల్లాపూర్ నైబర్‌హుడ్ ఆధ్వర్యంలో శుక్రవారం సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి.జోల్ డేవిస్ కలసి వినతిపత్రం అందించారు. ఆయన వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన చౌరస్తాలను పరిశీలించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను త్వరలో పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈశ్వరగారి రమణ, డా.ప్రవీణ్ వర్మ, అభినయ్, వేణుగోపాల్ రెడ్డి, రాంకుమార్, రవి కరణ్, దీప్తి పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి దామోదర, చింతా ప్రభాకర్



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్

ఆదర్శప్రాయుడు బాబు జగ్జీవన్‌రామ్

సంగారెడ్డి పట్టణంలో భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయం పక్కన ఉన్న ఆయన విగ్రహానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వివిధ ఉద్యోగ సంఘాలు, కుల సంఘాలు, యువజన సంఘాలు, పాఠశాలలు, వసతి గృహాల్లో వేడుకలు నిర్వహించారు. - సంగారెడ్డి

తప్పుడు వార్తలు రాస్తే ఊరుకోను

- చట్టపరమైన చర్యలు తీసుకుంటా
- బీఆర్‌ఎస్‌ను వీడేది లేదు
- ఎమ్మెల్యే మాణిక్‌రావు



జహీరాబాద్ టౌన్: తాను పార్టీ మారుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తూ ఫేక్ న్యూస్ ఇస్తున్నవారిపై పరువు నష్టం దావా వేస్తానని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. తనకు కేసీఆర్ నాయకత్వంపై పూర్తి నమ్మకం ఉందన్నారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టినప్పటి నుంచి బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నానని చెప్పారు. 2014లో బీఆర్‌ఎస్ తరపున పోటీచేసి ఓడినా.. తర్వాత కేసీఆర్ తనపై నమ్మకంతో 2019, 2023లో టిక్కెట్ ఇచ్చి గెలిపించారని చెప్పారు. 12 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారుతున్నారని, అందులో తన పేరును తీన్మార్ మల్లన్న తన ఛానల్‌లో ప్రస్తావించడం శోచనీయమన్నారు. తీన్మార్ మల్లన్న ఫేక్ న్యూస్ ఇస్తున్నాడని, ఆయన మాటలను ఎవరూ నమ్మొద్దని చెప్పారు. పార్టీ మారడంలేదని గతంలోనే స్పష్టం చేశానని, అయినా మళ్లీ మళ్లీ ఫేక్ న్యూస్ ఇవ్వడం కరెక్ట్ కాదన్నారు. తప్పుడు వార్తలతో కార్యకర్తలు కన్ఫ్యూజన్‌లో ఉండవద్దని స్పష్టం చేశారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటున్నానని, నియోజకవర్గంలో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నాని చెప్పారు.

మద్యం స్వాధీనం

జహీరాబాద్ టౌన్: పట్టణంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని జిల్లా టాస్క్‌పోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం గాంధీనగర్‌లోని బెల్ట్‌షాపుపై దాడులు నిర్వహించి 5.78 లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జోరుగా నీటి దందా!

- పంట పొలాల నుంచి తరలింపు
- పెద్ద ట్యాంకర్ల ద్వారా తీసుకెళ్లి వ్యాపారం
- లక్షలు ఆర్జిస్తున్న అక్రమార్కులు
- అమలుకు నోచని ఉన్నత అధికారుల ఆదేశాలు



రాత్రి సమయంలో తెల్లాపూర్‌లో నీటి ట్యాంకర్‌లను అడ్డుకున్న స్థానికులు



నీటిని తరలిస్తున్న ట్యాంకర్

ఎండలు మండుతుండడంతో నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. ధనార్జనే ధ్యేయంగా కొందరు అక్రమార్కులు దొడ్డిదారిన భూగర్భ జలాలను తోడేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నగరానికి నీటిని తరలించి విక్రయాలకు పాల్పడుతున్నారు. చట్టానికి వ్యతిరేకంగా నీటి విక్రయాలు జరుపుతూ భూగర్భ నీటి నిల్వకు మంగళం పాడుతున్నారు. ఇలా వాల్టాకు తూట్లు పొడుస్తున్నా అధికారులు పట్టించుకోనట్లు వ్యవహరిస్తున్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ఉండేందు నీటి వ్యాపారంపై కఠినంగా వ్యవరించాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించినా రామచంద్రాపురం మండల పరిధిలో అవేవి అమలుకు నోచుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులకు డబ్బులు ఆశ చూపి పంట పొలాల నుంచి నీటిని ఇష్టానుసారంగా తరలిస్తున్నారు. నిత్యం లక్షల లీటర్ల నీటిని ట్యాంకర్‌ల ద్వారా నగర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఇలా నీటి దందాతో లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు.

ట్యాంకర్లకు భలే గిరాకీ

హోటల్, బహుళ అంతస్తుల భవనాలలో నీటి కొరత కారణంగా ట్యాంకర్‌లకు మంచి డిమాండ్ ఉంది. దీంతో రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పంట పొలాల నుంచి రాత్రి సమయంలో పెద్దపెద్ద ట్యాంకర్‌లలో నీటి నింపుకొని తీసుకెళ్తున్నారు. ఈ దందాను నియంత్రించడంలో అధికారులు పూర్తి విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. ప్రస్తుతం అధికారులు సైతం ఎన్నికల విధుల్లో బీజీగా ఉండటంతో వ్యాపారస్తులకు మరింత కలసి వచ్చింది. నీటి వ్యాపారం ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో నీటి కష్టాలు తప్పవని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భజలాల శాతం తగ్గే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

మినరల్ వాటర్‌దందా..

కొంత మంది అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మినరల్ వాటర్‌ప్లాంట్‌లను ఏర్పాటు చేసి నీటి వ్యాపారం చేస్తున్నారు. గతంలో అధికారులు వీరిపై కఠినంగా వ్యవహరించినా.. ప్రస్తుతం పట్టించుకోకపోవడంతో మళ్లీ పుట్టగొడుగుల్లా వెలిశాయి.

తెల్లాపూర్‌లో ట్యాంకర్ల లొల్లి..

తెల్లాపూర్ మున్సిపాలిటీ నుంచి నిత్యం వందలాది ట్యాంకర్ల ద్వారా నీటిని నగర ప్రాంతానికి తీసుకుపోతుండటంతో శుక్రవారం తెల్లావారుజామున 2గంటల సమయంలో స్థానికులు అడ్డుకున్నారు. నిత్యం ఇలా నీటిని తరలిస్తే రానున్న రోజుల్లో నీటి ఇబ్బందులు తప్పవని వ్యాపారులకు తెలిపారు. నీటి వ్యాపారాన్ని అరికట్టకపోతే భూగర్భ జలాలు పూర్తిగా అడగంటిపోయే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం



తెల్లాపూర్‌లో నీటి దందా జోరుగా సాగుతోంది. నిత్యం పెద్దపెద్ద ట్యాంకర్‌లు ఈ ప్రాంతానికి వచ్చి నీటిని నింపుకుని పోతున్నాయి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– ఈశ్వరగారి రమణ, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు

చర్యలు తప్పవు



నీటి వ్యాపారంపై కఠినంగా వ్యవహరిస్తాం. ఈ అక్రమ దందాపై చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ఇద్దరు సిబ్బందిని ఏర్పాటు చేశాం. ఈ విషయంపై తహసీల్దార్‌కు సైతం లేఖ రాయడం జరిగింది.

– సంగారెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్

డబుల్ షూటర్లుగా పనిచేస్తాం

కాట శ్రీనివాస్ గౌడ్, నీలం మధు



మాట్లాడుతున్న కాటా శ్రీనివాస్‌గౌడ్, నీలం

పటాన్‌చెరు/రామచంద్రాపురం: ప్రజల ఆదరణతో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని పటాన్‌చెరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జన జాతర సభ సన్నాహక సమావేశం కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం రామచంద్రపురంలోని ఓ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీ అభ్యర్థి నీలం మధు మాట్లాడారు. అందరం సమష్టిగా ముందుకెళ్తే కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. కాటా శ్రీనివాస్ గౌడ్ తనకు సోదరుడిలాంటివాడని, ఇకపై తామిద్దరం కలిసి కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఇకపై పార్టీలో డబుల్ షూటర్లుగా పనిచేస్తామని అన్నారు. తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన జాతర సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

లక్షన్నర మెజారిటీ తీసుకొస్తాం : కాటా

నీలం మధు, తాను కలిసిపోయామని, మెదక్ ఎంపీ ఎన్నికల్లో పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో లక్షన్నర ఓట్ల మెజారిటీ లక్ష్యంగా కృషి చేస్తానని కాటా శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కొందరు కావాలనే రాజకీయం చేస్తున్నారని, మా ఇద్దరి మధ్య గొడవలు పెట్టిన వ్యక్తి ఇటీవలే జైలు నుంచి విడుదలయ్యాడని, కార్యకర్తలు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. సమావేశంలో శ్యామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడలో నిర్వహిస్తున్న జన జాతర భారీ బహిరంగ సభకు పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి 30 వేల మందిని తరలించేందుకు అంత సిద్ధం చేశారు. ఇందుకుగాను సభకు తరలించేందుకు ప్రత్యేకంగా కమిటీలను కూడా వేశారు.పదిమందితో కలిసి ఒక వింగును సైతం ఏర్పాటు చేశారు.

సూర్య @ 43.2



- నిప్పులు కక్కుతున్న భానుడు
- సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు
- సదాశివపేట, చేర్యాల మండలం చిట్యాల గ్రామంలో 43.2 డిగ్రీలు
- రాష్ట్రంలోనే మూడో స్థానం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: భానుడు భగ్గుమంటున్నాడు. సూర్య ప్రతాపానికి జనం విలవిలలాడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణం, సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాల గ్రామంలో 43.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. ఇది రాష్ట్రంలోనే మూడో అత్యధిక ఉష్ణోగ్రత కావడం ఆందోళనకు గురి చేస్తోంది. ఇటు జిల్లా కేంద్రం సంగారెడ్డితో పాటు జిల్లా వ్యాప్తంగా ఎండల తీవ్రత అధికంగా ఉంటోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని పటాన్‌చెరు, రామచంద్రాపురంలో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 10 గంటల ఎండలు మండిపోతోంది. వేడి తీవ్రతను జనం తట్టుకోలేకపోతున్నారు. భానుడి భగభగలకు తోడు తీవ్రమైన వేడిగాలులు వీస్తున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలోనే ఈ స్థాయిలో ఎండలుంటే., వచ్చే నెల మేలో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండ వేడిని తట్టుకోలేక ప్రజలు శీతల పానియాలు తీసుకుంటున్నారు. మరోవైపు మధ్యాహ్నం వేళల్లో తీవ్రత అధికంగా ఉండటంతో రోడ్లపైకి రావాలంటేనే జనం జంకుతున్నారు. దీంతో ప్రధాన వ్యాపార కూడళ్లు సైతం నిర్మానుష్యంగా మారుతున్నాయి.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

ఓబీసీ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్



రైతు సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న లక్ష్మణ్

సంగారెడ్డి : రైతు ఏడ్చిన రాజ్యం.. ఎద్దు ఏడ్చిన ఎవుసం ఎన్నడూ బాగుపడలేదని, రైతురాజ్యం తెస్తామని మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం నిలబడదని బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం స్థానిక కొత్త బస్టాండ్ వద్ద పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం జిల్లా అధ్యక్షులు గోదావరి ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు మరో 46 హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని, వాటిని అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల్లో గెలవగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఇప్పటి వరకు దాని ఊసే లేదన్నారు. గత హామీలు నెరవేర్చకుండా ఎంపీ ఎన్నికల్లో గెలిపించండి.. రాహుల్ గాంధీ ప్రధాని కాగానే అమలు చేస్తామని అబద్దపు ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజలు నమ్మొద్దన్నారు. రైతుల సమస్యలు తెలుసుకోవడం కోసం మోడీ ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్ 9904119119ను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదోని రవీందర్, రమేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తోట చంద్రశేఖర్, అసెంబ్లీ ప్రభారి గురువారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మాణిక్‌రావు, అనంతరావు కులకర్ణి, రాజశేఖర్, రాజుగౌడ్, పోచారం రాములు, ద్వారక రవి, శ్రీపతి రావు రైతులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన ఇద్దరి అరెస్ట్

సంగారెడ్డి : దారి దోపిడీలకు పాల్పడుతూ ఓ వ్యక్తి మరణానికి కారణమైన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఎస్పీ రూపేష్ వెల్లడించారు. ఈ నెల 4న ఉదయం 11 గంటలకు ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన మోహినొద్దీన్(31)ను దోచుకునే క్రమంలో కంది గ్రామశివారులో దాబా దగ్గర హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసును ఛేదించడానికి పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేశారు. శుక్రవారం మామిడిపల్లి చౌరస్తాలో 161 జాతీయ రహదారిపై సంగారెడ్డి రూరల్ సీఐ అశోక్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా నిందితులు మహ్మద్ ఇస్మాయిల్, సయ్యద్ ముదాసీర్ పట్టుబడ్డారు. వారి నుంచి నేరాలకు ఉపయోగించిన కత్తులు, నగదు, సెల్‌ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రూపేష్

క్లుప్తంగా

ప్రజలంతా సంతోషంగా ఉండాలి

- మంత్రి దామోదర రాజనర్సింహ


పూజలు చేస్తున్న దామోదర

మునిపల్లి(అందోల్): తెలంగాణ ప్రజలంతా ఆర్థికంగా అభివృద్ధి చెంది సంతోషంగా ఉండాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శివపార్వతుల దేవతామూర్తులను కోరారు. శుక్రవారం మండలంలోని మల్లారెడ్డిపేట గ్రామంలో శివాలయం 5వ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా గజస్తంభ స్థాపన కార్యక్రమాన్ని అదే గ్రామానికి చెందిన సంగమేశ్వర్, మల్లేశ్వరమ్మ దంపతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతులకు దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పృథ్వీరాజ్, అనురాధ, జగదీశ్వర్, శివకుమార్, మల్లన్న కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పొట్లపల్లిలో 'బలగం' వేణు


వేణు దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామిని శుక్రవారం బలగం సినిమా దర్శకుడు వేణు వెల్దండి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు సతీష్‌శర్మ వేణు దంపతులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. అనంతరం గ్రామస్తులు వేణును సన్మానించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి


మాట్లాడుతున్న శంకర్, తదితరులు

గజ్వేల్ : గజ్వేల్‌కు చెందిన దళిత న్యాయవాది బత్తుల రాజుపై దాడి చేసిన ప్రభుత్వ ప్లీడర్ అశోక్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం ఏసీపీ కార్యాలయంలో బాధితుడు బత్తుల రాజుతోపాటు దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పీ.శంకర్, దళిత ఉద్యోగుల ఐక్యవేదిక నాయకులు పీ.ఎల్లయ్య, పీ.సత్యనారాయణ, ఎర్ర మల్లేశం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాజుకు చెందిన ప్లాట్‌ను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకునే కుట్రలో భాగంగా పిలిపించి మరీ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. వెంటనే అశోక్‌రెడ్డితోపాటు అతడి అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని లేని పక్షంలో జాతీయ, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

మూడుకు చేరిన మృతులు


సాయిలు(ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఇందిరానగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. శుక్రవారం కృష్ణాపూర్ గ్రామానికి చెందిన ఇప్పి సాయిలు(16) సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బంధువుల పెళ్లి పనుల కోసం వెళ్తుండగా కల్హేర్ మండలం ఇందిరానగర్ సమీపంలో ట్రాక్టర్ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయలైన విషయం విధితమే. ఈ ప్రమాదంలో కృష్ణాపూర్‌కు గ్రామానికి చెందిన కాటిపాపల సాయిలు, ఒడ్డెర సాయిలు అక్కడికక్కడే మృతి చెందారు.ఇప్పి సాయిలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రోడ్డు ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

న్యాయ విద్యలో రాణించేలా..

సంగారెడ్డిలో గిరిజన న్యాయ కళాశాల

- దేశంలోనే మొదటి లా కాలేజీ
- ఏటా 60 మందికి బోధన
- 51 సీట్లు గిరిజనులకు, 9 సీట్లు ఇతరులకు
- జూన్ 3వ తేదీన లాసెట్ ప్రవేశ పరీక్ష



సంగారెడ్డిలోని గిరిజన లా కళాశాల

సంగారెడ్డి టౌన్: గిరిజన విద్యార్థులు న్యాయ విద్యలో రాణించేలా ప్రోత్సహించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ ఉద్దేశ్యంతో ప్రత్యేకంగా న్యాయ విద్య అభ్యసించేలా మొట్టమొదటి గిరిజన లా కళాశాలను మూడేళ్ల కిందట సంగారెడ్డిలో ఏర్పాటు చేశారు. దేశంలోనే ఏర్పడిన మొదటి ఎస్టీ గురుకుల న్యాయ కళాశాల ఇది.

ఐదేళ్ల కోర్సు..

ఇంటర్మీడియట్ అర్హతతో లాసెట్ రాసిన వారిలో ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ఇతర రిజర్వేషన్లు కూడా ఉంటాయి. ఐదేళ్లలో బీఏ ఎల్బీబీ పూర్తి చేసేందుకు వీలుంటుంది. ప్రతీ సంవత్సరం 60 మందికి ప్రథమ సంవత్సరంలో సీట్లు కేటాయిస్తున్నారు. 51 సీట్లు గిరిజనులకు, 9 సీట్లు ఇతరులకు కేటాయిస్తారు. గత విద్యా సంవత్సరం 29 సీట్లు భర్తీ కాలేదు. ఈ విద్యాసంవత్సరం లాసెట్ దరఖాస్తుల స్వీకరణ మార్చి 1న ప్రారంభమైంది. ఏప్రిల్ 15 వరకు గడువు విధించారు. జూన్ 3న లాసెట్ ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఇందులో మెరుగైన ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఈ కళాశాలలో సీటు పొందవచ్చు. గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా కళాశాల అధ్యాపకులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఉచిత వసతి సౌకర్యం..

కళాశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు భోజనం, వసతి కల్పిస్తారు. ఎలాంటి ఖర్చు లేకుండానే కోర్సు పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుంది. కాలేజీలోని గ్రంథాలయంలో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థుల కోసం వ్యాయామశాల ఏర్పాటు చేశారు. అలాగే న్యాయవాదులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తుంటారు. స్పోకెన్ ఇంగ్లిష్, పీజీ కోర్సులకు సంబంధించిన తరగతులను నిర్వహిస్తుంటారు.

న్యాయ సేవ చేస్తా



మారుమూల తండాల నుంచి వచ్చి ఇక్కడ న్యాయ శాస్త్రం విద్యను అభ్యసిస్తున్నాను. పేదవారికి న్యాయం అందించాలని లక్ష్యంతో న్యాయ శాస్త్రం చదువుతున్నాను. శిక్షణ కోసం కోర్టుకు వెళ్లినప్పుడు వారు చెప్పే సలహాలు, సూచనలను అనుసరిస్తూ శిక్షణ తీసుకుంటున్నాను. మంచి న్యాయవాదిగా పేరు తెచ్చుకొని పేద వారికి ఉచిత న్యాయసేవ చేస్తాను.

– ఆకాశ్ విద్యార్థి, కామారెడ్డి జిల్లా, గాంధారి మండలం

శిక్షణ తరగతులు



కళాశాలలో మంచి అనుభవం ఉన్న న్యాయవాదులు శిక్షణ తరగతులు ఇస్తున్నారు. హైకోర్టులో ఇంటర్న్‌షిప్ శిక్షణ తీసుకున్నాను. న్యాయవాదులు చెప్పే కోర్టు సెక్షన్లు, కోర్టులో న్యాయం ఎలా చేయాలో అనే వాటిని నేర్చుకుంటూ న్యాయ విద్యలో అభ్యసిస్తున్నాను. కేసులు ఎలా వాదించాలో తెలుసుకుంటున్నాను.

– కుషాల్వి విద్యార్థి, సంగారెడ్డి జిల్లా, సిర్గాపూర్ మండల్

సద్వినియోగం చేసుకోవాలి



సంగారెడ్డిలోని గిరిజన సంక్షేమ గురు కుల న్యాయ కళాశాలను విద్యార్థులు ఎంపిక చేసుకొని సద్వినియోగం చేసుకోవాలి. తృతీయ సంవత్సరం విద్యార్థులకు హైకోర్టులో ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఆ సమయంలో ఉపకార వేతనం అందజేస్తాం. 60 సీట్లలో 51 సీట్లు ఎస్టీలకే ఉన్నాయి. మిగతావి ఇతర రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేస్తారు. ఇక్కడ చదివితే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుంది.

– నిరీక్షణరావు, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్


రాజ్యాంగ రక్షణ యాత్రలో నాయకులు

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

- జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

హుస్నాబాద్: మాల మహానాడు ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న రాజ్యాంగ రక్షణ యాత్ర శుక్రవారం హుస్నాబాద్‌కు చేరుకుంది. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి, బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో 400 సీట్లు ఇస్తే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని మారుస్తామని మతతత్వ పార్టీలు అంటున్నారని తెలిపారు. అదే జరిగితే మౌలిక సూత్రాల పునాదులు ధ్వంసం అవుతాయని, జీవించే హక్కు, మాట్లాడే హక్కును కోల్పోతామని తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మేడి అంజయ్య, వెన్న రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల రాజయ్య, నాయకులు కిష్టస్వామి, యాస శ్రీనివాస్, హరీశ్ బాబు, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవాస్తవ లెక్కలు వద్దు

- ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలి
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

సిద్దిపేటజోన్: అకాల వర్షాలతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, అధికారులు మాత్రం ప్రభుత్వానికి అవాస్తవ నివేదికలు ఇచ్చారని, సమగ్ర విచారణ ద్వారా రైతులకు న్యాయం చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధిష్టానం పిలుపు మేరకు శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద పార్టీ ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.... అధికారుల చర్యలు కొత్త కాదని, ఏ ప్రభుత్వం ఉన్నా వారికే వత్తాసు పలకడం సహజంగా ఉంటుందని విమర్శించారు. కానీ వాస్తవ పరిస్థితులను ప్రభుత్వానికి చెప్పే బాధ్యత కూడా అధికారులకు ఉందన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ప్రతీ ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు విద్యాసాగర్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

పోలీసు కస్టడీలో నీతూబాయి

- పీటీ వారెంటుపై అదుపులోకి..
- గంజాయి విక్రయాల కేసులో విచారణ


నీతూబాయిని విచారిస్తున్న మహేందర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న హైదరాబాద్ నానక్‌రామ్ గూడకు చెందిన నేరస్తురాలు నీతూబాయిని శుక్రవారం గజ్వేల్ రూరల్ పోలీసులు రెండు రోజుల కస్టడీ నిమిత్తం పీటీ వారెంటుపై వర్గల్ మండలం గౌరారం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ ప్రాంతంలో గంజాయి విక్రయాలకు సంబంధించి రూరల్ సీఐ మహేందర్ రెడ్డి ఆమెను విచారించారు. గంజాయి ఎక్కడ నుంచి తెచ్చేది, ఎవరెవరికి అమ్మేది, ఆమె గూగుల్‌పే, ఫోన్‌పే డిజిటల్ లావాదేవీల గురించి ఆరా తీశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నానక్‌రామ్ గూడకు చెందిన నీతూబాయి 10 ఏళ్ల నుంచి గంజాయి అమ్ముతుంది. ఈ క్రమంలో ఆమెను, ఆమె కుటుంబ సభ్యులను శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు, గోల్కొండ, గచ్చిబౌలి పోలీసులు 18 కేసుల్లో అరెస్టు చేశారు. గతంలో హైదరాబాద్ పోలీసులు ఆమెపై పీడీ యాక్ట్ నమోదు చేసి సుమారు సంవత్సరంపాటు జైలులో ఉంచారు. ఆమె ఆస్తులను అటాచ్ చేశారు. అయినప్పటికీ గంజాయి వ్యాపారం కొనసాగిస్తుంది. నీతూబాయి తెలిపిన ప్రకారం వర్గల్ మండలంతోపాటు చుట్టుపక్కల గ్రామాలలో గంజాయికి అలవాటు పడిన యువకులను విచారిస్తామని రూరల్ సీఐ పేర్కొన్నారు. సమావేశంలో గౌరారం ఎస్సై శివకుమార్ ఉన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం..

- రూ.2.30 లక్షలు కాజేసిన వ్యక్తి
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

పటాన్‌చెరు టౌన్: ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి పై కేసు నమోదైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ కేఎస్‌ఆర్ కాలనీకి చెందిన శ్యాంప్రసాద్‌కు అతడి స్నేహితుడు విజయ్ హైదరాబాద్ ఇన్ఫోసిస్‌లో సీనియర్ కన్సల్టెన్‌గా పని చేస్తున్న రాంబాబు అనే వ్యక్తి ఉన్నాడని చెప్పాడు. అతడు ఉద్యోగాలు పెట్టిస్తాడని శ్యాంప్రసాద్‌ను నమ్మించాడు. శ్యాంప్రసాద్ గతేడాది సెప్టెంబర్ 20వ తేదీన రాంబాబుకు ఫోన్ చేసి తన ఉద్యోగం కోసం అడిగాడు. అడ్వాన్స్‌గా రూ.25 వేలు ఇవ్వాలని చెప్పడంతో పంపించాడు. శ్యాంప్రసాద్‌తోపాటు మరో 8 మంది స్నేహితులు తమకు కూడా ఉద్యోగాలు కావాలని రూ.2.30 లక్షలు రాంబాబుకు పంపించారు. ఉద్యోగం వచ్చిన తర్వాత అదనంగా ప్రతి ఒక్కరూ రూ. 50 వేలు చెల్లించాలని చెప్పాడు. బాధితులకు ఆన్‌లైన్ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి, ఆఫర్ లెటర్ వస్తుందని నమ్మించాడు. అనంతరం ఎంత ఫోన్ చేసినా స్పందించకపోవడంతో బాధితులంతా శుక్రవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రాంబాబుపై కేసు నమోదు చేశారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

మర్కూక్(గజ్వేల్): జీవితంపై విరక్తితో ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం అర్ధరాత్రి మర్కూక్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన అనీల్ (35) మద్యానికి బానిసై ప్రతి రోజూ తాగి జులాయిగా తిరిగేవాడు. గురువారం సాయంత్రం స్నేహితులతో కలిసి మద్యం సేవించి తనకు జీవితంపై విరక్తి వస్తుందని స్నేహితులతో వాపోయాడు. మీరు వెళ్లి మద్యం తీసుకొని రండి అని స్నేహితులను అక్కడి నుంచి పంపించి చెట్టుకు ఉరి సుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులకు, బంధువులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో..

దుబ్బాక: కుటుంబ కలహాలతో యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీరాం ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దొమ్మాట గ్రామానికి చెందిన చారుకొండ గంగవ్వ రెండో కుమారుడు మురళి(30) కి దౌల్తాబాద్‌కు చెందిన నవనీతతో కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తల మధ్య మూడేళ్ల కిందట నుంచి గొడవలు జరుగుతున్నాయి. పెద్ద మనుషుల మధ్య పంచాయతీలు పెట్టినా ఫలితం లేదు. ఈ క్రమంలోనే మురళి తన ఇంట్లో దూలానికి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి కనకవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ.6 లక్షలు పట్టివేత

మనూరు(నారాయణఖేడ్) : ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.6 లక్షల నగదును సీజ్ చేసినట్లు మనూరు ఎస్‌ఐ అంబ్రనాయక్ శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని స్థానిక బాదల్‌గాం గ్రామం వద్ద నేషనల్ హైవేపై వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. బొలేరో వాహనం జహీరాబాద్ నుంచి నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తి వైపు వెళ్తున్న క్రమంలో మొహినొద్దీన్ అనే వ్యక్తి వద్ద రూ.6 లక్షలు నగదు దొరికాయన్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశామన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఐ బోజ నాయక్, స్థానిక పోలీసు సిబ్బంది ఉన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి


భీమయ్య (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్) : అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మంగళపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల నర్సింలు అనే రైతు శుక్రవారం ఉదయం చేను వద్దకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన మంగళి భీమయ్య(45) గ్రామ శివారులోని తన పంట పొలం వద్ద ఓ చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పంచనామా నిర్వహించి అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు చేయనున్నట్లు ఎస్‌ఐ నవతగౌడ్ తెలిపారు. గురువారం రాత్రి పంట చేనుకు నీరు పెట్టడానికి వెళ్లిన వ్యక్తి అకస్మాత్తుగా మృతిచెందడంపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య పెంటమ్మ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..


కలమ్మ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆసిఫ్ అలీ కథనం ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని గొల్లబస్తీకి చెందిన బోడి కలమ్మ(48) కుమారుడు రాజేశ్ నాలుగు నెలల కిందట గుండెపోటుతో మృతి చెందడంతో అప్పటినుంచి డిప్రెషన్‌కు లోనైంది. మనస్తాపంతో కలమ్మ గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, మృతుడి భర్త బోడి పాపయ్య శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రన్నింగ్‌లో కారు రివర్స్ తీస్తుండగా..

చెట్టును ఢీకొట్టడంతో యువకుడు మృతి

పటాన్‌చెరుటౌన్: కారు చెట్టును ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజేశ్ నాయక్ కథనం ప్రకారం.. సంగారెడ్డి శాంతినగర్‌కు చెందిన భగీరథ్ కుమార్(19), అతడి స్నేహితుడు నిఖిల్ కుమార్ ఇద్దరూ కలిసి శుక్రవారం తెల్లవారుజామున పటాన్‌చెరు మండలం ముత్తంగి ఓ హోటల్‌కు వచ్చారు. తిరిగి ఐదు గంటలకు సంగారెడ్డి వైపు వెళ్తున్న సమయంలో పటాన్‌చెరు మండలం లక్డారం శివారులోకి రాగానే రన్నింగ్‌లోనే కారును నిఖిల్ కుమార్ రివర్స్ తీయడంతో చెట్టుని ఢీకొట్టింది. ఈ ఘటనలో భగీరథ్ కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడు సస్పెండ్

సాక్షి ఎఫెక్ట్


భాకి చంద్రభాను

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని దుద్దెడ హైస్కూల్లో ఇంగ్లిష్ సబ్జెక్టు ఉపాధ్యాయుడు భాకి చంద్రభానును సస్పెండ్ చేస్తూ శుక్రవారం డీఈఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. బ్యాడ్ టచ్ టీచర్స్ శీర్షికతో ఈనెల 4 వ తేదీన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. వివరాల్లోకి వెళ్తే.. దుద్దెడ హైస్కూల్లో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న భాకి చంద్రభానును అదే స్కూల్‌లో 10వ తరగతి పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్‌గా నియామకం చేశారు. మార్చి 26న ఫిజిక్స్ పరీక్ష రాస్తున్న సోషల్ వెల్ఫేర్ స్కూల్‌కు చెందిన విద్యార్థినీతో భాకి చంద్రభాను అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో పరీక్షను సరిగా రాయలేకపోయానంటూ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ లక్ష్మికి ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ విషయంపై మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదిక అందజేయాలని డీఈఓ కార్యాలయం నుంచి ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలిచ్చారు. దీనిపై విద్యార్థినీని, చీఫ్ సూపరింటెండెంట్‌ని, చంద్రభానును మార్చి 30న వేర్వేరుగా విచారించి రికార్డులతో సహ సేకరించిన నివేదికను ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి డీఈఓ కార్యాలయంలో అప్పగించారు. ఈ విషయాన్ని డీఈఓ కలెక్టరు మనుచౌదరి దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయుడు భాకి చంద్రభానును సస్పెండ్ చేస్తూ డీఈఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి ధ్రువీకరించారు.

సిరుల స్వీట్ కార్న్

సాగుపై రైతుల ఆసక్తి

- జిల్లాలో వెయ్యికి పైదిలుకు ఎకరాల్లో..
- మార్కెట్‌లోనూ మంచి డిమాండ్

తూప్రాన్: స్వీట్‌కార్న్ ఓ తియ్యని పంట.. సాధారణ మొక్కజొన్న రకాన్ని పోలి ఉంటుంది. ఈ పంటకు మార్కెట్‌లోనూ డిమాండ్ ఎక్కువే. స్వీట్ కార్న్ (మొక్క జొన్న) పంటను జిల్లాలో విరివిగా సాగు చేస్తారు. తూప్రాన్ మండలంలోని ఘనపూర్, యావపూర్, అల్లాపూర్, నర్సంపల్లి, తదితర గ్రామాలు స్వీట్‌కార్న్ పంటకు ప్రసిద్ధి. ఆరుతడి పంట, స్వల్ప కాలికం, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని రైతులు మక్కువ చూపుతుంటారు. జిల్లాలో వెయ్యి పైచిలుకు ఎకరాలు, మండలంలో సుమారు 100 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు.

మూడు నెలల్లోనే..

పంటను సాగు చేసిన రైతులకు సిరులు కురుపిస్తోంది. ఈ పంట సాగు కోసం పెద్దగా ఎరువులు, పురుగుల మందు అవసరం లేదు. బోరు బావుల్లో సమృద్ధిగా నీరు ఉంటే సరిపోతుంది. మూడు నెలల వ్యవధిలో పంట చేతికి వస్తుంది. స్వీట్ కార్న్‌తో వివిధ రకాల స్వీట్లు, వంటకాలు చేస్తుండడంతో మంచి డిమాండ్ ఏర్పడింది. హైదరాబాద్ నుంచి నేరుగా వ్యాపారులు గ్రామాల్లోని రైతుల వద్దకు వచ్చి పంటను పరిశీలించి ముందుగా కొంత అడ్వాన్స్ చెల్లిస్తున్నారు. పంట చేతికి రాగానే వ్యాపారులే వాహనాల్లో పంటను తీసుకెళ్తున్నారని రైతులు చెబుతున్నారు.

ఎకరాకు రూ.18 వేల ఖర్చు..

ప్రస్తుతం మార్కెట్‌లో కిలోకు రూ.10 నుంచి రూ.15 వరకు ధర విక్రయం అవుతుంది. డిమాండ్ ఎక్కువగా ఉన్న సందర్భాల్లో రూ.20 వరకు ధర వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరానికి 2 కిలోల విత్తనాలు అవసరం. ఇందులో మేలు రకం విత్తనాలు కిలో రూ.1,600 నుంచి రూ.2,800 వరకు మార్కెట్‌లో లభిస్తున్నాయి. ఎకరా స్వీట్‌కార్న్ పంట సాగుకు విత్తనాలు, దున్నకానికి, మందుల పిచికారీ కోసం మొత్తం రూ.18 వేల వరకు ఖర్చు అవుతుంది. విత్తిన 90 రోజుల్లో ఎకరానికి 5 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ఎకరాకు ఖర్చు పోను రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.


తూప్రాన్ మండలం ఘనపూర్‌లో సాగు చేస్తున్న స్వీట్ కార్న్

లాభదాయకంగా ఉంది



స్వీట్‌కార్న్ పంటను కొన్నేళ్లుగా సాగు చేస్తున్నా లాభదాయకంగానే ఉంది. ఇతర పంటలతో పోల్చుకుంటే మందుల ఖర్చు తక్కువ, ఆరుతడి పంట కావడంతో సాగు చేస్తున్నాం. తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి వస్తోంది.

– బాల్‌రాజు, రైతు, ఘనపూర్

మార్కెట్‌లో డిమాండ్



పంటకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు నేరుగా పంట వద్దకే వచ్చి పంటను కొనుగోలు చేస్తున్నారు. ఇతర పంటలతో పోల్చుకుంటే ఈ పంటకు మంచి లాభాలు వస్తున్నాయి. చాలా మంది రైతులు ఈ పంటను సాగు చేసేందుకు ఇష్ట పడుతున్నారు.

– స్వామి, రైతు, ఘనపూర్